- సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్
- ఎంజీఎం దవాఖానలో వైద్య సేవల్లో అంతరాయం.. ఇబ్బందిపడ్డ రోగులు

## సమ్మెలో జూనియర్ డాక్టర్లు



ఎంజీఎంలోని గాంధీ విగ్రహం వద్ద ప్ల కార్డులతో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కాశీబుగ్గ, జూన్ 23 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. వరంగల్ ఎంజీఎం దవాఖానలోని గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. సకాలంలో స్టైఫండ్, దవాఖానలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ విషయాన్ని నెల రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం, వైద్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపామన్నారు. సోమవారం నుంచి ఎమర్జెన్సీ సేవలు మినహా అన్ని వైద్య సేవలకు తాము దూరంగా ఉన్నట్లు తెలిపారు. దవాఖానకు వచ్చే పేద, మధ్య తరగతి రోగులకు మెరుగైన వైద్యం అందించాలంటే తప్పనిసరిగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేసిన వైద్యకళాశాలల్లో సరిపడా సిబ్బంది, వైద్య పరికరాలు, భవనాలు, సదుపాయాలు లేవని, వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, వరంగల్ ఎంజీఎం దవాఖానలో జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగడంతో రోగులు వైద్య సేవలు అందక ఇబ్బందిపడ్డారు. జూనియర్ డాక్టర్లు, పీజీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులు ఎమర్జెన్సీ సేవలు తప్ప మిగతా విధులకు దూరంగా ఉన్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యం అందక అవస్థలు పడ్డారు. ఓపీలో పెద్ద ఎత్తున క్యూలో రోగులు వేచి ఉన్నారు.

# నాయకులకు పుట్టినిల్లు



- 2001 నుంచి రాజకీయ ఫ్యాక్టరీగా భారత రాష్ట్ర సమితి
- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థాయిల్లో నేతలు తయారు
- వేల సంఖ్యల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు
- కొందరు పార్టీలు మారినా పటిష్ట నాయకత్వంతో గులాబీ పార్టీ

**నాయకులను తయారు చేసే రాజకీయ ఫ్యాక్టరీగా భారత రాష్ట్ర సమితి నిలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్‌లో ఉమ్మడి జిల్లాలో మొదటి నుంచీ కొత్త నాయకత్వం పుట్టుకువస్తున్నది. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ప్రతి సందర్భంలోనూ కొత్త వారికి అవకాశం ఇస్తున్నది. వేల సంఖ్యల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని తయారుచేసింది. కొందరు పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయినా.. సొంత బలంతో మళ్లీ నేతలను తయారుచేస్తూనే ఉన్నది. స్వార్థం కోసం ఉద్యమ పార్టీకి ద్రోహం చేసి కొందరు పార్టీలు మారినా బీఆర్ఎస్ ప్రతి సారి నూతన బలాన్ని కూడగట్టుకుంటూ ముందుకు సాగుతున్నది.**

**- వరంగల్, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

### బీఆర్ఎస్‌లో కొత్తగా ఎదిగిన వారెందరో..

2001లో బీఆర్ఎస్(టీఆర్ఎస్) ఆవిర్భావంతోనే కొత్త నేతలు తయారయ్యే ప్రక్రియ మొదలైంది. ఉద్యమ కాలంలో విద్యార్థి, రైతు, కార్మిక, న్యాయవాదుల నుంచి పలువురు ముఖ్యమైన నేతలు తయారయ్యారు. గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు వరకు వేల మంది వచ్చారు. వీరిలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. మరికొందరు ఉద్యమకారులు ప్రభుత్వంలో ఇతర పదవులు పొందారు. 2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ కొత్త రాజకీయ చరిత్రను సృష్టించింది. బీఆర్ఎస్ బలపరిచిన వారిలో అత్యధిక మంది గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులుగా తొలిసారి ఎన్నికయ్యారు. అదే ఏడాది ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ వందల మంది కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా గెలిచారు. 2001 నుంచి ఇటీవలి వరకు ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున కొత్త నేతలు ఎన్నికవుతూనే ఉన్నారు. రాజకీయంగా అనుభవం ఉన్న కొందరు పార్టీలోకి వచ్చినా గులాబీ పార్టీ నుంచే తొలిసారి ఎంపీలుగా, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. గ్రామ స్థాయిలో ప్రస్తుతం ఉన్న కీలక నాయకులు అంతా మొదట బీఆర్ఎస్ నుంచి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టిన వారే.

### కీలక నేతలు..

2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తొలిసారిగా పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో జడ్పీటీసీ సభ్యులుగా గెలిచిన పలువురు ఆ తర్వాత ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. గతంలో కొద్దిపాటి రాజకీయ నేపథ్యం ఉన్నా బీఆర్ఎస్ నుంచి తొలిసారిగా చట్టసభలకు ఎన్నికైన వారు ఎందరో ఉన్నారు. న్యాయవాదిగా ఉన్న బోయినపల్లి వినోద్‌కుమార్ తొలిసారి బీఆర్ఎస్ తరఫున హనుమకొండ ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత 2008 ఉపఎన్నికల్లోనూ విజయం సాధించారు. అదేవిధంగా దాస్యం వినయ్‌భాస్కర్ ఎమ్మెల్యేగా గెలిచాడు. ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వీ సతీశ్ కుమార్ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రెండు సార్లు ఎమ్మెల్సీగా విజయం సాధించారు. బీఆర్ఎస్‌తోనే ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు అనేక మంది ఉన్నారు. రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దల పద్మ, జడ్పీ అధ్యక్షులు ఎం.సుధీర్‌కుమార్, పాగాల సంపత్‌రెడ్డి, కుసుమ జగదీశ్, అంగోతు బిందు, జక్కు శ్రీహర్షిణి, బడే నాగజ్యోతి తొలిసారి ఎన్నికల్లో గెలిచారు. వీరిలో బడే నాగజ్యోతి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ములుగు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. విద్యార్థి నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, జోరిక రమేశ్, ఉద్యమకారులు బోయినపల్లి రంజిత్, బోడ డిన్న తొలిసారి బీఆర్ఎస్ నుంచే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్పొరేటర్లుగా గెలిచారు. విద్యార్థి నాయకుడు కే వాసుదేవారెడ్డికి బీఆర్ఎస్ రాష్ట్ర చైర్మన్‌గా అవకాశం కల్పించింది. ఉద్యమ నాయకులు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజు యాదవ్‌కు పార్టీ కుడా చైర్మన్ పదవి ఇచ్చింది. బీఆర్ఎస్ తరఫున అనేక మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికై పార్టీకి ద్రోహం చేసి ఇతర పార్టీలో చేరినా గులాబీ పార్టీ ఎప్పుడూ బలం కోల్పోలేదు. పార్టీలోని మరింత మంది కొత్త నేతలుగా తయారయ్యారు. బీఆర్ఎస్ ఆవిర్భావంలో కొత్తగా వచ్చిన పసునూరి దయాకర్ వరంగల్ ఎంపీగా గెలిచారు. రవీంద్రనాయక్ బీఆర్ఎస్ నుంచి తొలిసారి ఎంపీగా ఇదే స్థానంలో గెలిచారు. 2004లో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాల ఎమ్మెల్యేగా, బండారి శారారాణి పరకాల ఎమ్మెల్యేగా, కే లక్ష్మారెడ్డి నర్సంపేట ఎమ్మెల్యేగా, దుగ్యాల శ్రీనివాస్‌రావు చెన్నూరు ఎమ్మెల్యేగా, మందాడి సత్యనారాయణరెడ్డి హనుమకొండ ఎమ్మెల్యేగా తొలిసారి బీఆర్ఎస్ నుంచే ఎన్నికై ఆ తర్వాత ఇతర పార్టీల్లోకి మారారు. బీఆర్ఎస్ ఇచ్చిన అవకాశాలతో ఉన్నత పదవులు పొందిన వారిలో ఎందరు పార్టీలు మారినా గులాబీ పార్టీ ఎప్పటికప్పుడు మరింత పటిష్ట నాయకత్వంతో ముందుకు సాగుతున్నది.



- సమైక్య పాలనలో అరకొర విద్యుత్‌తో ఆగమైన ఎవుసం
- కాంగ్రెస్ వచ్చినంక పాతరోజులు గుర్తుకొస్తున్నయ్
- మంచి చేసిన కేసీఆర్‌ను బద్నాం చేయడం సరికాదు
- వివిధ వర్గాల ప్రజల మనోగతం

# నాడు గోసపడ్డం

### సారొచ్చినంక సంబురంగున్నం
### కేసీఆర్ హయాంలోనే 24 గంటల ఫుల్ కరెంట్

**'నాడు వచ్చీరాని కరెంట్‌తో గోసపడ్డం. సమైక్య పాలనలో అరకొర విద్యుత్‌తో ఆగమైనం. చేను వద్ద కునుకు తీస్తేనే మడి పారేది. విష పురుగుల బారిన పడేటోళ్లం. పనుల్లేక చిరు వ్యాపారులు విలవిలలాడిన్రు. కేసీఆర్ సార్ వచ్చినంక 24 గంటల కరెంటిచ్చుడుతోటి సంబురంగున్నం. రాష్ట్రం వచ్చినంక నిరంతర విద్యుత్ సరఫరాతో రైతులు పంటలు బాగా పండించుకొని లాభపడ్డరు. చిన్న వ్యాపారులు, దుకాణాదారులు, మెకానిక్‌లకు మంచిగ పని దొరికింది. తెలంగాణ వస్తే కరెంట్ కష్టాలు వస్తాయన్న నాయకులకు దిమ్మ తిరిగేలా పెద్దాయన సమాధానం చెప్పిండు. ఇంత చేసిన కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. కాంగ్రెస్ రాకతో మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నయి' అని వివిధ వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.**

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 24**

### 24 గంటల కరెంట్‌తో ఊపిరి పీల్చుకున్నం



ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కరెంట్ సరిగా లేక గోసపడ్డం. ఏ రాత్రి వస్తదో తెలియదు. అది రాగానే పొలం దగ్గరకు పరుగు పెట్టేది. ఎప్పటి వరకు ఉంటదో తెలియక పోయేది. మిర్చి తోటలు సాలు తడవక ముందే కరెంట్ పోయేది. ఏం చేయాలో తెలియక, పంటను ఎండబెట్టుకోలేక సతమతమయ్యేది. ఆయిలింజన్లతో నీరు పారించినా తడి లేక పంట దిగుబడి రాకపోయేది. 2014 తర్వాత కేసీఆర్ 24 గంటలు కరెంటివ్వడంతో ఊపిరి పీల్చుకున్నం. పంటలు మంచిగ పండినయ్. కంటిరెప్ప పాటు కూడా కరెంట్ పోలేదు.

– బాస పుల్లయ్య, ఏటూరునాగారం

### కేసీఆర్‌పై ఆరోపణలు సరికాదు



వర్ధన్నపేట: కేసీఆర్ పట్టుదలతో రాష్ట్రంల 24 గంటల పాటు కరెంట్ ఇచ్చిండు. ఆయన తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో విద్యుత్ వ్యవస్థ మెరుగు పడింది. ఎవుసానికి ఉచితంగ 24 గంటల కరెంటియ్యడం వల్లే రైతులు పంటలు బాగా పండించుకొని లాభపడ్డరు. గ్రామాల్లో కూడా చిన్నచిన్న వ్యాపారులు, దుకాణాదారులు, మెకానిక్‌లకు మంచిగ పని దొరికింది. ఇంత చేసిన కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయిండు. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక రాష్ట్రం రాకముందున్న కరెంట్ సమస్యలు మళ్ల వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. – రాజు, మోటర్ మెకానిక్, వర్ధన్నపేట



### వ్యవసాయం పండుగైంది

దంతాలపల్లి: సమైక్య పాలనలో ఉన్న విద్యుత్ ఇబ్బందులను తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోకి తీసుకొచ్చింది. 2014కు ముందు రాత్రి పూటే సాగుకు కరెంట్ ఇవ్వడం తో చేను వద్ద కునుకు తీస్తేనే మడి పారేది. చాలా మంది రైతులు పాములు, ఇతర విష పురుగుల కాటుకు చనిపోయారు. కేసీఆర్ వచ్చినంక 24 గంటల విద్యుత్‌ను అందించిండు. రైతులకు ఉచితంగా నిరంతర సరఫరా చేయడంతో వలస వెళ్లిన రైతులు తిరిగి స్వగ్రామాలకు వచ్చి ఎవుసాన్ని పండుగలా చేసుకున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరున్నర నెలల్లోనే విద్యుత్ ఇబ్బందులు తీసుకొచ్చింది. కేసీఆర్ ప్రభుత్వానికి సాధ్యమైన కరెంట్.. కాంగ్రెస్ సర్కారుకు ఎందుకు కావడం లేదు. ఆయన చేపట్టిన సంస్కరణలపై కాంగ్రెస్ మాట్లాడడం అర్థరహితం.

– రాచకొండ రామ్మూర్తి, రైతు, దంతాలపల్లి

# విసిగి.. వేసారి..

### భూ సమస్య పరిష్కారానికి ఐదేళ్లుగా పోరాటం

- ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు
- అధికారులు పట్టించుకోకపోవడంతో మనస్తాపం
- కలెక్టరేట్ భవనం పైకెక్కి పురుగుల మందు తాగిన పసరమడ్ల యువకుడు నర్సింగరావు
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యాయత్నం
- లంచం ఇచ్చి పట్టా చేసుకున్నారని దాయాదులపై ఆరోపణ



నర్సింగరావును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు



పురుగుల మందు తాగుతున్న బాధితుడు

జనగామ, జూన్ 24 (నమస్తే తెలంగాణ)/జనగామ చౌరస్తా : తన భూమి సమస్యను పరిష్కరించాలని ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నాడు. పలుమార్లు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం మరోసారి కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించాడు. వారు పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తాను బతికుండగా భూమి దక్కదని, చనిపోతేనే పరిష్కారం లభిస్తుందని భావించాడు. సమీకృత కలెక్టరేట్ భవనం పైకెక్కి పురుగుల మందు తాగాడు. ఈ ఘటన జనగామ కలెక్టరేట్‌లో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలం పసరమడ్లకు చెందిన యువకుడు నిమ్మల నర్సింగరావు తండ్రికి గ్రామంలోని సర్వే నంబర్ 159, 160, 231/డిలో పూర్వీకుల నుంచి వచ్చిన 3.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే వీరి కుటుంబం 2016లో బతుకుదెరువు కోసం మేడారం వెళ్లడంతో ఆ భూమిపై దాయాదుల కన్ను పడింది. 2017లో అప్పటి తహసీల్దార్ జే రమేశ్, వీఆర్వో క్రాంతికి సదరు భూయజమానులు చనిపోయారని నమ్మించడంతో పాటు లంచం ఇచ్చి పాండు, ఎల్లయ్య, ఉపేందర్, శివకుమార్ పేర్లపై పట్టా చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సింగరావు అప్పటి నుంచి తన భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్వయంగా కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో గతంలో మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కొనసాగిన పాత కలెక్టరేట్‌లో ఒంటిపై కిరోసిన్, కొత్త కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకోగా, మరోసారి తన భార్యతో కలిసి ఇదే భవనంపై నుంచి కిందకు దూకే ప్రయత్నం చేశాడు. తాజాగా సోమవారం ప్రజావాణికి వచ్చిన నర్సింగరావు అధికారుల సమాధానం సరిగా లేకపోవడంతో కలెక్టరేట్ పైకి ఎక్కాడు. తనతో తెచ్చుకున్న ఫ్లెక్సీని గోడకు కట్టి పురుగుల మందు తాగాడు. అక్కడున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా సంబంధిత భూమి వివాదం కోర్టులో ఉందని తెలిపారు.

### భూ వివాదం కోర్టులో ఉంది..

ఆత్మహత్యాయత్నం చేసిన నిమ్మల నర్సింగరావుకు సంబంధించి భూమి వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసరమడ్ల గ్రామంలో నర్సింగరావు ముత్తాత నిమ్మల మైసయ్యకు 8.16 ఎకరాల భూమి ఉండగా, పాలోళ్లు ఎల్లయ్య, పాండు 3.20 ఎకరాల భూమిని 2017లో అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపారు. దీంతో నర్సింగరావు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నాడని, ఈ విషయమై నిమ్మల పాండు జనగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నర్సింగరావుతోపాటు మరో నలుగురిపై దావా వేసి ఇంజెక్షన్ ఆర్డర్ పొందినట్లు చెప్పారు. ఈ వివాదాన్ని సివిల్ కోర్టు లేదా లీగల్ సర్వీసెస్ ద్వారా పరిష్కరించుకోవాలని గతంలో నర్సింగరావుకు అధికారులు సూచించారని, అయినా పదే పదే ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించి పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేశాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయం పరిశీలిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

- మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి

గీసుగొండ/హనుమకొండ, జూన్ 24 : ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు రానున్నట్లు తెలిసింది. వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా పార్కును సందర్శిస్తారని, పార్క్‌లో ఏర్పాటైన పరిశ్రమలు, మౌలికవసతుల కల్పనపై పార్కులోనే టీఎస్ఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఈ పర్యటనపై టీఎస్ఐఐసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సత్యశారదాదేవి సోమవారం పార్కును సందర్శించారు. పరిశ్రమలు, పార్క్‌కు కేటాయించిన భూముల వివరాలతో కూడిన మ్యాప్‌తో పాటు హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఇప్పటికే పార్కులో రెండు పరిశ్రమలు ఉత్పత్తి కొనసాగిస్తున్నాయని, కిటెక్స్ కంపెనీ నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నదని అధికారులు వివరించారు. జోనల్ మేనేజర్ సంతోశ్ కుమార్, తహసీల్దార్ రియాజుద్దీన్ ఉన్నారు. అదేవిధంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నట్లు తెలిసింది.

## రవాణా శాఖపై ఏసీబీ నజర్

- మహబూబాబాద్ జిల్లాలో వారం రోజులుగా ప్రత్యేక నిఘా
- కార్యాలయానికి వచ్చే వారిపై ఆరా తీస్తున్న అధికారులు

మహబూబాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖపై ఏసీబీ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారుల తీరుపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుండడంతో వారం రోజులుగా కార్యాలయానికి వచ్చి, వెళ్లే వారిపై నిఘా పెంచారు. ఇటీవల రవాణా శాఖ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసింది. అనంతరం ఇదే కార్యాలయంలో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సోషల్ మీడియాలో సైతం వైరల్ కావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం మహబూబాబాద్ కార్యాలయం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడికి వివిధ పనుల కోసం వచ్చే వాహనదారుల నుంచి భారీగా డబ్బులను ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులకు సైతం పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. దీంతో గత సోమవారం నుంచి కార్యాలయానికి ఎవరెవరు వస్తున్నారు? ఏమేమి పనులు చేస్తున్నారు? అనే విషయాలపై నిఘా పెట్టారు. కార్యాలయంలో వరుస ఘటనలపై రవాణా శాఖ ఉప కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఇప్పటికే కమిషనర్‌కు ఉన్నత స్థాయి నివేదిక అందజేశారు. అధికారులు డబ్బులు ఇవ్వని వారితో అసభ్యంగా మాట్లాడడంతో పాటు ఫైలులో ఈ పేపర్ లేదు.. ఆ పేపర్ లేదు.. అంటూ పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏసీబీ అధికారులు నిఘా పెంచడంతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సైతం అప్రమత్తమయ్యారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.